

సరికొత్తగా ఈవీఎంలు
మారుతున్న కాలానికి అనుగుణంగా ఓటింగ్ విధానంలో కూడా మార్పులు చోటు చేసుకుంటున్నాయి.
- 10లో



తుంగతుర్తి.. మూడు జిల్లాల్లో
ఎంతో చరిత్ర ఉన్న తుంగతుర్తి నియోజకవర్గం జిల్లా పునర్విభజనతో మూడు జిల్లాల పరిధిలోకి వెళ్లింది.
- 10లో



నేటి నుంచి కార్తీక పూజలు
కార్తీకమాసం సందర్భంగా మంగళవారం నుంచి యాదాద్రిలో ప్రత్యేక పూజలు, వ్రతాలు నిర్వహించనున్నారు.
- 12లో

న్యూస్‌రీల్

డిసెంబర్ 5 వరకు ఎన్నికల్ కోడ్

భువనగిరి : ఎన్నికల కోడ్ డిసెంబర్ 5వ తేదీ వరకు అమల్లో ఉంటుందని భువనగిరి రిటర్నింగ్ అధికారి అమరేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోడ్ ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులపై రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నేరుగా, కంట్రోల్ రూమ్ నంబర్ 08685 298904ను సంప్రదించాలని కోరారు.

కార్మిక వ్యతిరేక పార్టీలను ఓడించండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ, కాంగ్రెస్ నాయకులు

యాదగిరిగుట్ట : ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీఆర్‌ఎస్, బీజేపీలను ఓడించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గోరేటి రాములు పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ ముద్రించిన ప్రజా, కార్మిక వ్యతిరేక ప్రభుత్వాలను ఓడించాలనే కరపత్రాలను యాదగిరిగుట్టలో సోమవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు కార్మిక, కర్షక, యువజన, విద్యార్థులకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని విమర్శించారు. అలాంటి పార్టీలకు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. ఆలేరు నియోజకవర్గంలో సీపీఐ బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి బీర్ల ఐలయ్యకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, కొల్లూరి రాజయ్య, మండల కార్యదర్శి జిల్లా జానకిరాములు, సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్, కో ఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బందారపు భిక్షపతి, నాయకులు గుండ్లపల్లి భరత్‌గౌడ్, ఎర్రగుంట శేఖర్, దొమ్మాట శేఖర్, బొజ్జ సాంబేష్ పాల్గొన్నారు.

పేదలపక్షాన పోరాడిన ఘనత కమ్యూనిస్టులదే



మాట్లాడుతున్న సీతారాములు, చిత్రంలో మునుగోడు సీపీఎం అభ్యర్థి నర్సిరెడ్డి

సంస్థాన్ నారాయణపురం : పేదల పక్షాన పోరాడేది ఒక్క కమ్యూనిస్టులేనని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు పేర్కొన్నారు. మునుగోడు సీపీఎం అభ్యర్థి దోనూరు నర్సిరెడ్డిని గెలిపించాలని కోరుతూ సోమవారం పుట్టపాకలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూలి రేట్ల పెంపు, రైతులు, కార్మికులు, ప్రజా సమస్యలపై నిజాయితీగా నిరంతర పోరాటాలు చేసిన ఘనత ఎర్రజెండాదేనన్నారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ కమ్యూనిస్టుల పోరాట ఫలితమేనన్నారు. బూర్జువా పార్టీలకు ఓట్లు అడిగే హక్కులేదని, సీపీఎం అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థి దోనూరు నర్సిరెడ్డి, నాయకులు బండ శ్రీశైలం, సురకంటి శ్రీనివాస్‌రెడ్డి, దొంతగోని పెద్దులు, ఎంపీటీసీ సభ్యురాలు మర్రి వసంత నర్సిరెడ్డి, శ్రీనివాస చారి, ఎండి పాషా, వర్కాల చంద్రశేఖర్, కేసి రెడ్డి యాదవరెడ్డి, చింతకాయల నరసింహ, ఉప్పలపల్లి బాలకృష్ణ, దొంతగాని అమరేందర్, జనిగల నరసింహ, గంగాదేవి సైదులు,పిట్ట రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

పోచంపల్లివాసికి సాహిత్య పురస్కారం



గజ్జెల రామకృష్ణ

భూదాన్‌పోచంపల్లి : నిజాం వెంకటేశం స్మారక సాహిత్య పురస్కారానికి-2023 భూదాన్‌పోచంపల్లిలోని మార్కండేయనగర్‌కు చెందిన కవి గజ్జెల రామకృష్ణ ఎంపికయ్యారు. రామకృష్ణ రచించిన 'చంద్రుడు లేని ఆకాశం' అనే కవితా సంపుటికి పురస్కారం లభించింది. ఈ నెల 14న సికింద్రాబాద్ నిర్వహించనున్న కార్యక్రమంలో అవార్డు అందుకోనున్నట్లు రామకృష్ణ తెలిపారు. పోచంపల్లి త్రివేణి సాహితీ సంఘం ప్రతినిధులు తడక యాదగిరి, పట్నం కృష్ణ కుమార్, గుంటి దయానంద్, డాక్టర్ పాండాల మహేశ్వర్, వడ్డేపల్లి రాజేశ్వర్, భోగ బాలసుబ్రహ్మణ్యం హర్షం వ్యక్తం చేశారు.

యాదాద్రిలో ధనలక్ష్మీ పూజ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధనలక్ష్మీ పూజను కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ ముఖ మండపంలో అధిష్ఠించారు. వేద పారాయణాలు పఠిస్తూ ధనలక్ష్మి పూజ చేశారు. ఈ వేడుకలో ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, అర్చకులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు. అంతకుముందు స్వాతి నక్షత్రం సందర్భంగా శ్రీస్వామి, అమ్మవార్లకు శతఘటాభిషేకం నిర్వహించారు.



ధనలక్ష్మీపూజ నిర్వహిస్తున్న అర్చకులు, చిత్రంలో ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి

73 తిరస్కరణ

355 మంది నామినేషన్లు ఓకే

- అత్యధికంగా తుంగతుర్తి, మిర్యాలగూడలో తిరస్కరణ
- అతి తక్కువగా మునుగోడులో ఒకటి
- తిరస్కరణకు గురైన వాటిలో మాజీ మంత్రులు జానారెడ్డి, మోత్కుపల్లి నామినేషన్లు
- పూర్తయిన నామినేషన్ల పరిశీలన
- 15 వరకు ఉపసంహరణ గడువు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల పరిధిలో నామినేషన్ల పరిశీలన (స్క్రూట్నీ) సోమవారం పూర్తయింది. ఈ నెల 10వ తేదీ వరకు మొత్తం 428 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా.. వాటిలో 73 మంది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. 355 మంది అభ్యర్థుల నామినేషన్లకు ఎన్నికల అధికారులు ఓకే చెప్పారు. అత్యధికంగా తుంగతుర్తి, మిర్యాలగూడ నియోజకవర్గాల్లో నామినేషన్లు తిరస్కరణకు గురికాగా.. మునుగోడులో మాత్రం ఒక్క నామినేషన్ మాత్రమే తిరస్కరణకు గురైంది. నామినేషన్లను ఆయా నియోజకవర్గాల్లో రిటర్నింగ్ అధికారులు నిశితంగా పరిశీలించి.. సరిగా లేనివాటిని తిరస్కరించారు. తిరస్కరణకు గురైన వాటిలో మాజీ మంత్రులు జానారెడ్డి, మోత్కుపల్లి నర్సింహులు నామినేషన్లు ఉన్నాయి. వారితో పాటు పలువురు స్వతంత్రుల నామినేషన్లు ఉన్నాయి. ఇక ఈనెల 15వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు చివరి గడువుగా ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. ఆ తర్వాత బరిలో ఉండేది ఎంతమంది అనే విషయం తేలనుంది.



ఆలేరులో నామినేషన్ల స్క్రూట్నీ ప్రక్రియను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి వీరారెడ్డి

తిరస్కరణకు గురైన నామినేషన్లు ఇవీ..

- నల్లగొండ నియోజకవర్గంలో 39 మంది నామినేషన్లు వేయగా అందులో ముగ్గురి నామినేషన్లను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు.
- నకిరేకల్‌లో 33 మంది అభ్యర్థులకుగాను ఇద్దరి నామినేషన్లు తిరస్కరించారు.
- మునుగోడులో 51 మంది నామినేషన్లు దాఖలు చేయగా అందులో ఒక్కరి నామినేషన్‌ను తిరస్కరించారు.
- దేవరకొండలో 18 మంది నామినేషన్లు వేయగా ఐదుగురివి తిరస్కరణకు గురయ్యాయి.
- మిర్యాలగూడ నియోజకవర్గంలో 45 మంది నామినేషన్లు వేయగా, అందులో 12 మంది అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరించారు.
- నాగార్జునసాగర్‌లో 28 నామినేషన్లకు గాను ఏడుగురు అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి ప్రపోజర్స్ సంతకాలు సరిపడా చేయించకపోవడంతో ఆయన నామినేషన్‌ను తిరస్కరించినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఇద్దరు ప్రపోజర్స్ సంతకాలు చేయాల్సి ఉండగా.. ఒకరే చేశారు.
- సూర్యాపేట నియోజకవర్గంలో 42 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, 10 మంది అభ్యర్థుల నామినేషన్లను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు.
- తుంగతుర్తి నియోజకవర్గంలో 33 మంది నామినేషన్లు వేయగా, అందులో 12 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. కాంగ్రెస్ పార్టీ తరఫున నామినేషన్ దాఖలు చేసిన మోత్కుపల్లి నర్సింహులు అఫిడవిట్ సమర్పించకపోవడంతో ఆయన నామినేషన్‌ను తిరస్కరించారు.
- హుజూర్‌నగర్‌లో 40 మంది నామినేషన్లను దాఖలు చేయగా, ఐదుగురి నామినేషన్లను తిరస్కరించారు.
- కోదాడ నియోజకవర్గంలో 39 మంది నామినేషన్లు దాఖలు చేయగా, ముగ్గురి నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి.
- ఆలేరు నియోజకవర్గంలో 31 మంది నామినేషన్లు దాఖలు చేయగా.. 9 మంది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి.
- భువనగిరిలో 29 మంది నామినేషన్లు వేయగా నలుగురి నామినేషన్లను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు.

రేపటి వరకు ఉపసంహరణ

నామినేషన్లు ఉపసంహరించుకోవడాని మంగళ, బుధవారాల్లో అవకాశం కల్పించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రధాన పార్టీల నుంచి టికెట్లు ఆశించి భంగపడ్డ నాయకులు కొందరు బరిలో నిలిచేందుకు స్వతంత్రంగా నామినేషన్లు వేశారు. వారిని బుజ్జగించే పనిలో ముఖ్య నాయకులు ఉన్నారు. స్వతంత్రులను కూడా తమవైపునకు తిప్పుకునేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రయత్నాలు చేస్తున్నారు. బుధవారం సాయంత్రానికి ఉపసంహరణ ప్రక్రియ ముగిసి బరిలో ఉండే అభ్యర్థులు ఎవరో తేలనున్నారు.

ప్రచారానికి పైసలెట్లా?

- అప్పు చేద్దామన్నా దొరకడం లేదంటున్న అభ్యర్థులు
- స్థిరాస్తులు అమ్మినా సకాలంలో చేతికందని నగదు
- రోజువారీ ఖర్చులకు ఇబ్బందులు పడుతున్నామంటున్న నాయకులు

యాదాద్రి భువనగిరి జిల్లాలో ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి ఎన్నికల ఖర్చుకోసం భూమి విక్రయించారు. రిజిస్ట్రేషన్ కూడా చేశారు. రూ.కోట్లలో రావాల్సి ఉన్నా సకాలంలో చేతికందడం లేదు. కొనుగోలుదారుడు కాలయాపన చేస్తుండడంతో రోజువారీ ఎన్నికల ఖర్చుకు అభ్యర్థి ఇబ్బంది పడుతున్నాడు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మరికొందరు అభ్యర్థులు ఇటువంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నారు.



సాక్షి, యాదాద్రి : అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు డబ్బు కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నికల ఖర్చుకోసం ముందుగా వేసుకున్న అంచనాలు లెక్కతప్పాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం మందగించడంతో లావాదేవీలు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో రూ.కోట్లు విలువ చేసే భూములు అమ్మకానికి పెట్టినా కొనుగోలు చేసేవారు కరువయ్యారు. అమ్మిన స్థిరాస్తుల డబ్బులు సమయానికి చేతికందడం లేదు. వెరసి రోజువారీ ప్రచారానికి ఖర్చులు వెళ్లదీయం కూడా అభ్యర్థులకు కష్టంగా మారింది. అప్పుచేద్దామన్నా దొరికే పరిస్థితి లేకపోవడంతో ఎంత మిత్తి ఇవ్వడానికైనా సిద్ధపడుతున్నారు. అభ్యర్థుల నుంచి డబ్బులు అందకపోవడంతో కేడర్ బహిరంగ విమర్శలకు దిగుతున్నారు. కొందరు జెండా పక్కన పడేసి ప్రచారంలో పాల్గొనడం లేదు.

రోజు ఖర్చులే తడిసిమోపెడు

అభ్యర్థులకు రోజువారీ ఖర్చులు తడిసిమోపెడు అవుతున్నాయి. పోలింగ్ బూత్‌ల వారీగా ప్రచారం చేసే కార్యకర్తలకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, చేతి ఖర్చులు సగటున ఒక్కో బూత్‌కు రోజూ రూ.15వేల వరకు ఖర్చు వస్తుంది. వివిధ పార్టీల నుంచి చేరికల సందర్భంగా భోజనాలు, రవాణా ఖర్చులు, కొందరికి ప్యాకేజీలకు రూ.లక్షల్లో ముట్టజెప్పవలసి ఉంటుంది. అంతేకాకుండా ముఖ్య నాయకులకు వాహనాల కిరాయి, డీజిల్, పెట్రోల్ ఇతరత్రా ఖర్చులు ఏరోజుకారోజు చెల్లించాల్సిందే. దీంతో పాటు సభలకు, రోజువారి ప్రచారానికి వచ్చే మహిళలు, యువత బైక్ ర్యాలీలకు, ప్రచార రథాలు, కళాకారులకు ఏరోజుకారోజు చెల్లించాలి. దీంతో పాటు ఫ్లెక్సీలు, జెండాలు, టోపీలు, ఎన్నికల ప్రచార సామగ్రి ఇలా పలు రకాలుగా లెక్కకురాని ఖర్చు రూ.లక్షల్లో ఉంటుంది.

కొన్ని ఉదాహరణలు

- యాదాద్రి జిల్లాలో ఓ జాతీయ పార్టీకి చెందిన అభ్యర్థి డబ్బులకోసం తిప్పలు పడుతున్నాడు. ఎన్నికల కమిషన్ నిఘా పెట్టడంతో డబ్బులు వెంటవెంటనే తేలేని పరిస్థితి నెలకొంది. దీంతో రోజువారీ ప్రచార ఖర్చులను వెళ్లదీడయం కూడా అతనికి కష్టంగా మారింది.
- యాదాద్రి జిల్లాలో ప్రధాన ప్రతిపక్ష పార్టీకి చెందిన అభ్యర్థి హైదరాబాద్‌లో తనకున్న ఓపెన్ ప్లాట్లను విక్రయించాడు. కానీ, డబ్బులు ఇంకా చేతికంద లేదు. దీంతో స్థానిక కార్యకర్తలు, ప్రచారానికి వచ్చే వారికి చెల్లించేందుకు ఇబ్బందిగా మారింది.గత్యంతరం లేక వివిధ అవసరాలకు అయన చెక్‌లు ఇస్తున్నాడు. పోలింగ్ నాటికి డబ్బులు సమకూర్చుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు.
- సూర్యాపేట జిల్లాలో ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి చేతిలో డబ్బు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఐదు రూపాయలు వడ్డీ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా అప్పు దొరకడం లేదని సదరు నాయకుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. రోజువారీ కార్యక్రమాలకు కూడా చెల్లించలేకపోతున్నాడు. అందిన కాడల్లా అప్పులు తెచ్చి ఇస్తున్నట్లు వాపోయాడు.
- యాదాద్రి జిల్లాలో ప్రధాన ప్రతిపక్ష పార్టీ అభ్యర్థి ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్నాడు. టికెట్ కోసం తీవ్ర ప్రయత్నం చేశాడు. అయితే టికెట్ వస్తదో రాదోనని కొంత ఉదాసీనంగా ఉన్నాడు. అయితే టికెట్ రావడంతో డబ్బులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. అమ్మడానికి కోట్ల రూపాయలు విలువ చేసే భూమి ఉన్నా కొనుగోలు చేయడానికి ఎవ్వరూ ముందుకు రావడం లేదు. దీంతో ప్రచార ఖర్చులు వెళ్లదీయడం కూడా కష్టతరంగా ఉందని అభ్యర్థి వాపోతున్నాడు.

కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిక



సూధగాని హరిశంకర్‌గౌడ్, పల్లెపాటి సత్యనారాయణ తదితరులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, నాయకులు

యాదగిరిగుట్ట : బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సూధగాని హరిశంకర్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ, ముదిరాజ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లెపాటి సత్యనారాయణతో పాటు పలువురు డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి మంత్రి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మూడవసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందని, ఆలేరులో గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి గెలుపునకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో ముదిరాజ్ అసోసియేషన్ రాజాపేట మండల అధ్యక్షుడు మేడబోయిన పరశురాములు, భువనగిరి పార్లమెంట్ బీజేపీ ఐటీ సెల్ కన్వీనర్ సూధగాని ఉదయ్ కిరణ్‌గౌడ్, మోటకొండూర్ నాయకులు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రెడ్డి అసోసియేషన్ మోటకొండూరు మండల అధ్యక్షుడు అనంతుల తిరుమల్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల ప్రెసిడెంట్ ఎస్.తిరుమల్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నేతలు అమృతం శివకుమార్, యువమోర్చా నాయకుడు పల్లె నరేందర్‌గౌడ్‌లున్నారు.

ఎమ్మార్పీఎస్‌-టీఎస్ మద్దతు బీఆర్‌ఎస్‌కే

- రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్

ఆలేరురూరల్ : అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ఎమ్మార్పీఎస్‌–టీఎస్ మద్దతు ఇస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ప్రకటించారు. సోమవారం ఆలేరులోని కేజేఎన్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ ఒక్క కేసీఆర్ వల్లే సాధ్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ మాదిగలను మోసం చేసిందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు అసెంబ్లీలో వర్గీకరణ బిల్లు ప్రవేశపెడుతామని హామీ ఇచ్చి మాట తప్పిందన్నారు. ఓట్ల కోసమే మాదిగలను వాడుకుందని విమర్శించారు. మరోసారి మాదిగల ఓట్లను దండుకునే యత్నం చేస్తుందని దుయ్యబట్టారు. ఆలేరు గడ్డపై మూడవసారి బీఆర్‌ఎస్ జెండా ఎగరవేస్తామన్నారు. కేసీఆర్ ఆలేరును రెవెన్యూ డివిజన్ చేస్తారని, గంధమల్ల చెరువును మల్లన్నసాగర్‌తో నింపి ఆలేరు, రాజాపేట మండలాల సస్యశ్యామలం చేస్తారని పేర్కొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యే టికెట్లు అమ్ముకొని రేటంత్‌రెడ్డిగా మారాడని విమర్శించారు. టికెట్‌లు అమ్ముకున్న వ్యక్తి రేపు అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని కూడా తాకట్టు పెడతాడని ఆరోపించారు. భిక్షమయ్యగౌడ్ మాట్లాడుతూ.. కేసీఆర్ మూడవసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. రేషన్‌కార్డు ఉన్న ప్రతి పేదవాడికి సన్న బియ్యంతో పాటు రూ.5లక్షల బీమా అందజేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మదర్‌డెయిరీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఆలేరు పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేశం, మున్సిపల్ చైర్మన్ శంకరయ్య, పీఏసీఎస్ చైర్మన్ మల్లేషం, గంగుల శ్రీనివాస్, అడెపు బాలస్వామి, పోరెడ్డి శ్రీనివాస్, జంపాల దశరథ, ఫిలిప్, కుండె సంపత్, దయ్యాల సంపత్, కొల్లూరి వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు హాలియాకు సీఎం రాక

ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొననున్న కేసీఆర్

- భారీ జనసమీకరణకు బీఆర్‌ఎస్ పార్టీ సన్నాహాలు

హాలియా: అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి గులాబీ పార్టీ దళపతి, ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం నాగార్జున సాగర్ నియోజకవర్గానికి రానున్నారు. హాలియాలోని అనుముల వద్ద దేవరకొండ రోడ్డు పక్కన 18 ఎకరాల మైదానంలో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభలో సీఎం పాల్గొని ప్రసంగించనున్నారు. ఈ మేరకు సాగర్ బీఆర్‌ఎస్ నాయకత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. సీఎం సభను సవాల్‌గా తీసుకున్న బీఆర్‌ఎస్ నాయకత్వం భారీ జన సమీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టింది. సీఎం సభకు కావాల్సిన వేదిక పనులను దగ్గర ఉండి పర్యవేక్షించింది. సభా వేదికపై సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్సీలు, బీఆర్‌ఎస్ ముఖ్య నేతలు కూర్చునేలా, వేదిక ముందు వీఐపీలు, మీడియాకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేయడంతోపాటు సభకు తరలివచ్చే జనం కోసం ప్రత్యేక వసతులు కల్పించారు. సభావేదికకు సమీపంలో హెలికాప్టర్ ల్యాండింగ్ కోసం హెలిప్యాడ్‌ను సిద్ధం చేశారు. వాహనాల పార్కింగ్‌కు హాలియా శివారు ప్రాంతాలైన మిర్యాలగూడ, దేవరకొండ, సాగర్ రోడ్ల వెంట ఖాళీ మైదానాలు కేటాయించారు. శివారు ప్రాంతాలు, పట్టణంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు.



హాలియాలో సిద్ధమైన సభావేదిక

లక్షమంది జన సమీకరణ

ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగ సభకు నాగార్జున సాగర్ నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు లక్ష మందిని తరలించాలని బీఆర్‌ఎస్ నాయకులు లక్ష్యంగా పెట్టుకున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి జనాన్ని సమీకరించేందుకు పార్టీ నాయకత్వం దృష్టి సారించింది. ఇప్పటికే జన సమీకరణకు ఆయా మండల, పార్టీ ముఖ్య నాయకులతో బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నోముల భగత్, ఎన్నికల ఇన్‌చార్జీలు ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్, జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, రాష్ట్ర ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవెల్లి విజయేందర్‌రెడ్డి సన్నాహక సమావేశాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున జనాన్ని తరలించేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. సభా ఏర్పాట్లను ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యే భగత్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, కలెక్టర్ కర్ణన్, పోలీసు అధికారులు పరిశీలించారు.

నేడు చిట్యాలలో కేటీఆర్ రోడ్ షో

చిట్యాల: నల్లగొండ జిల్లా చిట్యాలలో మంగళవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ మంత్రి కేటీఆర్ రోడ్‌షోతో పాటు ఎన్నికల ప్రచార సభ ఉంటుందని ఆ పార్టీ నకిరేకల్ ఎమ్మెల్యే అభ్యర్థి చిరుమర్తి లింగయ్య తెలిపారు. చిట్యాలలో రోడ్ షో, సభను నిర్వహించనున్న ప్రాంతాల సోమవారం ఆయన స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోడ్ షో కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ జడల ఆదిమలయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మెండె సైదులు, పార్టీ నాయకులు శేపూరి రవీందర్, బెల్లి సత్తయ్య, గుండెబోయిన సైదులు, వనం వెంకటేశ్వర్లు, జలంధర్‌రెడ్డి, పందిరి రమేష్, జిట్ట బొందయ్య, జమీరుద్దిన్, శూకూర్, సిలివేరు శేఖర్, రుద్రవరం యాదయ్య ఉన్నారు.

ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

సాక్షి,యాదాద్రి : ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు హనుమంతు కె.జెండగే సూచించారు. సోమవారం ఆయన తుర్కపల్లి మండలం వాసాలమర్రి, బీబీనగర్ మండలం గూడూరు చెక్ పోస్టులను తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్ని తప్పనిసరిగా తనిఖీ చేయాలని ఆదేశించారు. అలాగే కలెక్టరేట్‌లోని ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వైవల్ టీం, స్టాటిస్టికల్ సర్వైవల్ టీంల కంట్రోల్ రూంను సందర్శించి బృందాల పనితీరుపై ఆరా తీశారు. అనంతరం కంట్రోల్ రూం, ఎంసీఎంసీ సెంటర్‌ను సందర్శించారు. రికార్డులు, ఫిర్యాదులను పరిశీలించారు. ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని, ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు.



చెక్‌పోస్టు రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

కంట్రోల్‌రూంను పరిశీలించిన పోలీసు అబ్జర్వర్

సాక్షి,యాదాద్రి : కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూంను సోమవారం పోలీసు అబ్జర్వర్ విపుల్‌కుమార్ పరిశీలించారు. అలాగే సిబ్బందికి సూచనలు చేశారు. నిఘా పటిష్టంగా ఉండాలని, నగదు, మద్యం అక్రమ రవాణా జరగకుండా ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని సూచించారు. అలాగే సీ-విజిల్ యాప్ ద్వారా వస్తున్న ఫిర్యాదులను పరిశీలించారు.

భువనగిరి క్రైం : మండంలోని రాయగిరి పరిధిలోని గల పోలింగ్ కేంద్రాలను మంగళవారం పోలీసు పరిశీలకులు విపుల్‌కుమార్ సందర్శించారు. సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ రెండు కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా ప్రకటించారు. అనంతరం గౌతమి డిగ్రీ కళాశాలలోని సీఐఎస్ఎఫ్ వసతిగృహాన్ని సందర్శించారు. కల్పిస్తున్న సౌకర్యాలపై తెలుసుకున్నారు. ఆయన వెంట ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐలు సత్యనారాయణ, సుధీర్ కృష్ణ, ఎస్ఐ సంతోష్‌కుమార్ ఉన్నారు.

• మా బతుకులు మార్చాలే సారూ..



చివ్వెంల : మంత్రి జగదీష్‌రెడ్డి ఫొటోను తదేకంగా చూస్తున్న గిరిజన వృద్ధురాలు

• ఓట్ల బతుకమ్మ



మోటకొండూరు : బీఆర్‌ఎస్ ఆలేరు నియోజకవర్గ అభ్యర్థి గొంగిడి సునీత ఎన్నికల ప్రచారంలో భాగంగా బతుకమ్మ ఆడుతున్న మోటకొండూరు గ్రామ మహిళలు

• నేను రంగన్నను..



మిర్యాలగూడ : రైతు బజారులో ప్రచారం చేస్తున్న సీపీఎం అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి

• చేయూతనిస్తాం..



సంస్థాన్ నారాయణపురం : పూలు గుచ్చుతూ తన భర్త రాజగోపాల్‌రెడ్డికి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న కోమటిరెడ్డి లక్ష్మి

తుంగతుర్తి.. మూడు జిల్లాల్లో



తిరుమలగిరి (తుంగతుర్తి) : తెలంగాణ సాయుధ పోరాటం పేరు వినగానే తుంగతుర్తి గుర్తుకొస్తుంది. నిజాం నిరంకుశ పాలనకు భూస్వామ్య పెత్తందారి బానిస విధానాలకు వ్యతిరేకంగా ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు సాగాయి. పోరాట యోధులైన భీంరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం, మారోజు వీరన్న లాంటి వీరులు ప్రాంతం వారే. బండెనక బండి.. పదహారు బండ్లు కటి.. ఏ ఏ బండ్లో పోతవ్ కొడుకో నైజాం సర్కారోడా అన్న పాటతో ప్రజల్లో చైతన్యం రగిలించిన బండి యాదగిరిది కూడా ఈ ప్రాంతమే. మలి దశ తెలంగాణ ఉద్యమంలో తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారిది కూడా ఇదే నియోజకవర్గం. ఆ స్ఫూర్తితో ఈ ప్రాంతం రాజకీయ చైతన్యానికి పెట్టింది పేరుగా నిలుస్తోంది. ఎంతో చరిత్ర కలిగిన ఈ నియోజకవర్గం జిల్లా పునర్విభజనతో మూడు జిల్లాల పరిధిలోకి వెళ్లింది.

1967లో నియోజకవర్గంగా..

తుంగతుర్తి మొదటగా 1952లో సూర్యాపేట ద్విసభ నియోజకవర్గంలో ఉండేది. 1962లో నాగారం నియోజకవర్గంగా, 1967లో తుంగతుర్తి నియోజకవర్గంగా ఏర్పడింది. మొదటగా నియోజకవర్గంలో తుంగతుర్తి, తిరుమలగిరి, నూతనకల్, అర్వపల్లి, ఆత్మకూరు(ఎస్) మండలంలోని 11 గ్రామాలు ఉండేవి. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో కొత్త మండలాలు వచ్చి చేరాయి. 2016లో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన జిల్లాలు, మండలాల పునర్విభజనతో తుంగతుర్తి, తిరుమలగిరి, నూతనకల్, జాజిరెడ్డిగూడెం, మద్దిరాల, నాగారం మండలాలు సూర్యాపేట జిల్లా పరిధిలోకి, అడ్డగూడూరు, మోత్కూరు మండలాలు యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోకి, శాలిగౌరారం మండలం నల్లగొండ జిల్లా పరిధిలోకి వెళ్లింది.

12 సార్లు ఎన్నికలు..

తుంగతుర్తి నియోజకవర్గంలోని 9 మండలాల్లో 2,49,556 మంది ఓటర్లు ఉన్నారు. ఇప్పటి వరకు 12సార్లు ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీ నాలుగుసార్లు (1962, 1985, 1989, 2004) సీపీఎం మూడుసార్లు (1967, 1978, 1983), టీడీపీ (1999, 2009) రెండుసార్లు, ఇండిపెండెంట్ అభ్యర్థులు (1972, 1994) రెండుసార్లు విజయం సాధించారు. బీఆర్‌ఎస్ (2014, 2018) రెండుసార్లు విజయం సాధించింది.

జంగ్ తెలంగాణ

కోమటిరెడ్డి దేశభక్తి!



జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న వెంకట్‌రెడ్డి

నల్లగొండ : నల్లగొండ పట్టణంలో జనగణమన ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రతి రోజూ ఉదయం 8.30 గంటలకు పట్టణంలోని ప్రధాన కూడళ్లలో జాతీయ గీతాలాపన సాగుతోంది. అందులో భాగంగా సోమవారం ఉదయం 8.30 గంటలకు క్లాక్‌టవర్ సెంటర్ వద్ద జాతీయ గీతం వినిపించగానే.. ఆ సమయంలో ఎన్నికల ప్రచారానికి వాహనంలో వెళుతున్న నల్లగొండ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వాహనం దిగి జాతీయ పతాకానికి సెల్యూట్ చేశారు.

సరికొత్తగా ఈవీఎంలు

• ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లపై ఆయా పార్టీల గుర్తులతో పాటు అభ్యర్థి ఫొటో

కోదాడ, నల్లగొండ : మారుతున్న కాలానికి అనుగుణంగా ఓటింగ్ విధానంలో కూడా పలు మార్పులు చోటు చేసుకుంటున్నాయి. గతంలో బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు వేసేవారు. దాని స్థానంలో ప్రస్తుతం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)లను వాడుతున్నారు. ఆ తర్వాత ఈవీఎంలకు అనుబంధంగా ఓటర్ వెరిఫియబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్(వీవీ ప్యాట్) యంత్రాలను జోడించారు. ఈసారి ఎన్నికల్లో ఈవీఎంలపై అభ్యర్థికి కేటాయించిన గుర్తుతో పాటు సదరు అభ్యర్థి ఫొటోలను కూడా ఉంచనున్నారు.



తొలిసారిగా 1982లో..

ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలను ముద్రించడం, భద్రపర్చడం ఖర్చు, శ్రమతో కూడుకున్న వ్యవహారం కావడంతో వీటికి ప్రత్యామ్నాయంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం)ను ఉపయోగించాలనే ఆలోచన 1979లో చేశారు. తొలుత వీటిని ఐఐటీ బాంబే, ఇండ్రస్ట్రియల్ డిజైన్ సెంటర్ వారు సంయుక్తంగా తయారు చేశారు. వీటిని తొలిసారిగా కేరళలో 1982 అసెంబ్లీ ఎన్నికల్లో నార్త్ పరవూర్ నియోజకవర్గంలో కొన్ని పోలింగ్ బూత్‌లలో ప్రయోగాత్మకంగా వినియోగించారు. మంచి ఫలితాలు రావడంతో వీటి తయారీని ప్రభుత్వరంగ సంస్థలైన ఈసీఐఎల్, బీహెచ్ఈఎల్ సంస్థలకు అప్పగించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఈసీఐఎల్, బెంగళూరులోని బీహెచ్ఈఎల్ కంపెనీలు దేశం మొత్తానికి అవసరమైన ఈవీఎంలను తయారు చేస్తున్నాయి.

2004 నుంచి దేశవ్యాప్తంగా..

1999, 2001లలో వివిధ రాష్ట్రాలలో జరిగిన ఎన్నికల్లో ఈవీఎంలను ఎన్నికల సంఘం ఉపయోగించింది. 2004 నుంచి జరిగిన అన్ని పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎంలను వంద శాతం వినియోగిస్తూ వస్తున్నారు. ఈవీఎంల పనితీరుపై దేశంలోని పలు రాజకీయ పార్టీలు అనుమానాలు వ్యక్తం చేయడంతో ఈవీఎంలకు అనుబంధంగా వీవీ ప్యాట్‌లను తీసుకొచ్చారు. ఓటరు ఈవీఎంపై వేసిన ఓటు స్లిప్ రూపంలో వీవీ ప్యాట్ బాక్స్‌లలో పడుతుంది. ఒకవేళ కౌంటింగ్ సమయంలో ఈవీఎం ఓపెన్ కాకపోయినా, రీకౌంటింగ్ కావాలని ఎవరైనా అభ్యర్థి అడిగితే వీవీ ప్యాట్‌లో ఉన్న స్లిప్పులను లెక్కిస్తారు.

64 మంది వరకు ఉపయోగించవచ్చు..

ఒక్కో ఈవీఎంలో బ్యాలెట్ యూనిట్‌పై 16మంది అభ్యర్థులకు సంబంధించిన గుర్తులను ఏర్పాటు చేయవచ్చు. ఇలా నాలుగు ఈవీఎంలను ఒక కంట్రోల్ యూనిట్‌కు అనుసంధానించవచ్చు. అంటే ఒక కంట్రోల్ యూనిట్‌కు 64 గుర్తుల వరకు మాత్రమే అమర్చడానికి వీలవుతుంది. అంతకు మించి అభ్యర్థులు పోటీ పడితే అక్కడ బ్యాలెట్ పేపర్ వాడాల్సి ఉంటుంది. ఒక్క ఈవీఎంలో గరిష్ఠంగా 3840 ఓట్ల వరకు నమోదవుతాయి. ఓటరు తాను వేసిన ఓటును ఓటింగ్ యంత్రంపై 7 సెకన్ల పాటు చూసుకోవచ్చు. కంట్రోల్ యూనిట్‌లో నమోదైన ఓటు 10 సంవత్సరాల వరకు భద్రంగా ఉంటుంది.

అభ్యర్థి ఫొటో కూడా..

ఇప్పటివరకు ఈవీఎంలలో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్‌లు కలిపి ఉంటాయి. బ్యాలెట్ యూనిట్‌పై గతంలో అభ్యర్థి పేరు, అతనికి కేటాయించిన గుర్తు మాత్రమే ఉండేవి. ఈసారి ఎన్నికల్లో బ్యాలెట్ యూనిట్‌పై అభ్యర్థి ఫొటోను కూడా ఉంచనున్నారు. దీంతో ఓటరు గుర్తు విషయంలో ఇబ్బంది పడితే అభ్యర్థి ఫొటో చూసి తాను ఎవరికి ఓటు వేయాలో నిర్ణయించుకోవచ్చు.

పోలీసులకు పట్టుబడిన దొంగ

• 7.1 తులాల బంగారు, 63తులాల వెండి ఆభరణాలు, బైక్ స్వాధీనం

చౌటుప్పల్: పట్టణ కేంద్రంలోని విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై వలిగొండ క్రాస్ రోడ్డు వద్ద సోమవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా.. ఓ దొంగ పట్టుబడ్డాడు. సీఐ ఎస్. దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం... మోత్కూర్‌లోని పోతాయిగడ్డ కాలనీకి చెందిన సిరిగిరి సాయిబాబా గ్యాస్ స్టౌవ్‌లు రిపేర్ చేస్తూ జీవనం సాగించేవాడు. అతడికి వివాహం జరిగి పిల్లలు జన్మించిన తర్వాత కిడ్నీ వ్యాధికి గురయ్యాడు. కిడ్నీ ఆపరేషన్ కోసం లక్షల రూపాయలు వెచ్చించి అప్పులపాలయ్యాడు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటూ దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. ఈ క్రమంలో జనగామ, సూర్యాపేట, నేరేడుచర్ల, సిద్దిపేట, కోరుట్ల, పాలకుర్తి, చౌటుప్పల్ ప్రాంతాల్లో పదుల సంఖ్యలో దొంగతనాలకు పాల్పడ్డాడు. ఆయా కేసుల్లో అరెస్టు అయ్యి జైలుకు సైతం వెళ్లి వచ్చాడు. ఇటీవల తాజాగా చౌటుప్పల్, ఐనవోలు, ఆత్మకూర్, దేవరకొండ, బొమ్మలపురం, రామన్నపేట పోలీస్ స్టేషన్‌ల పరిధిలో దొంగతనాలు చేశాడు. బంగారు, వెండి ఆభరణాల్లో కొన్నింటిని విక్రయించి జల్సాలకు పాల్పడ్డాడు. మిగిలిన ఆభరణాలను ఎక్కడైనా విక్రయించాలన్న ఆలోచనతో దేవరకొండలో దొంగతనం చేసిన బైక్‌పై హైదరాబాద్‌కు బయల్దేరాడు. ఈ క్రమంలో చౌటుప్పల్ పట్టణ పరిధిలోని వలిగొండ క్రాస్ రోడ్డు వద్ద విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తుండగా వారికి చిక్కాడు. సాయిబాబాను అదుపులోకి తీసుకొని విచారించగా నేరాల చరిత్ర వెలుగులోకి వచ్చింది. నిందితుడిపై గతంలో వివిధ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో 19 కేసులు ఉన్నాయి. అతడి నుంచి 7.1తులాల విలువైన బంగారు ఆభరణాలు, 63తులాల వెండి ఆభరణాలు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కోర్టులో రిమాండ్ చేసి అనంతరం జైలుకు తరలించారు. ఎస్ఐ యాదగిరి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వరి పొలం దగ్ధం

గుండాల : గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించడంతో ఎకరంన్నర పొలంతో పాటు కుప్ప పోసిన వడ్లు, గడ్డి దగ్ధమైంది. ఈ ఘటన గుండాల మండలంలోని వస్తాకొండూర్ గ్రామంలో ఆదివారం సాయంత్రం జరిగింది. గ్రామానికి చెందిన మహేశ్వరం ప్రభాకర్‌రెడ్డి, మహేశ్వరం జిలుకమ్మల వరి పొలం పక్కన గ్రామానికి చెందిన కొండల్‌రెడ్డి, కృష్ణారెడ్డిల వరి గడ్డిపై గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు వేశారు. అది కాలుకుంటూ రైతులు మహేశ్వరం చిలుకమ్మ, ప్రభాకర్‌రెడ్డిల ఎకరంన్నర వరి పొలం తగులబడినట్లు చెప్పారు. అదే రైతుల వరి కోసి కుప్ప పోసిన వడ్లు కాలిపోయినట్లు తెలిపారు. సుమారుగా రూ. లక్ష నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

భూదాన్‌పోచంపల్లి: కుటుంబ కలహాలతో వివాహిత ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన సోమవారం మధ్యాహ్నం భూదాన్‌పోచంపల్లి మండలంలోని జిబ్లక్‌పల్లి గ్రామంలో చోటు చేసుకొంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. జిబ్లక్‌పల్లి గ్రామానికి చెందిన కొండపల్లి నర్సింహ, చౌటుప్పల్ మండలం లక్కారం గ్రామానికి చెందిన తన మేనమామ కుమార్తె కప్పెర సంతోష(18)ను ప్రేమించి 8 నెలల క్రితం పెళ్లి చేసుకున్నాడు. కాగా సంతోష తల్లి మల్లమ్మకు ఈ పెళ్లి ఏ మాత్రం ఇష్టం లేదు. ఇదే విషయమై సంతోష తల్లిదండ్రులు తరచూ గొడవ పడుతుండేవారు. అంతేకాక కుమార్తె సంతోషకు తల్లి మల్లమ్మ ప్రతి రోజూ ఫోన్ చేసి భర్తను వదిలేసి వస్తే మంచి సంబంధం చూసి తిరిగి పెళ్లి చేస్తానని చెప్పేది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సంతోష సోమవారం భర్త నర్సింహ బయటికి వెళ్లగా, మధ్యాహ్నం సమయంలో ఇంట్లో చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. చుట్టుపక్కల వారు గమనించి ఇంట్లోకి వెళ్లి చూడగా అప్పటికే ఆమె మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు.

వేటకు వెళ్లి.. విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



వెంకటయ్య (ఫైల్)



రోదిస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు

భూదాన్‌పోచంపల్లి: కముజు పిట్టల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు కరెంట్ తీగలకు తగిలి విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఈ విషాదకర ఘటన భూదాన్‌పోచంపల్లి మండలం జిబ్లక్‌పల్లిలో చోటుచేసుకుంది. జిబ్లక్‌పల్లి గ్రామానికి చెందిన కప్పెర వెంకటయ్య(45) పాత ఇనుప సామగ్రి బేరంతో పాటు, కంజులను పట్టుకొని వచ్చి విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నాడు. అందులో భాగంగా ఈ నెల 13న ఉదయం కముజు పిట్టల వేట కోసమని ఇంటి నుంచి బైక్‌పై బయలుదేరాడు. దోతిగూడెం శివారులో గ్రామానికి చెందిన పోశమోని శ్రీశైలం అడవి పందుల బెడద నుంచి రక్షణ పొందటానికి వరిపొలం, కూరగాయల తోటకు చుట్టూ కంచె ఏర్పాటు చేసి వైరుకు కరెంట్ కనెక్షన్ ఇచ్చాడు. చీకట్లో గమనించని వెంకటయ్యకు కరెంట్‌తీగ తలిగి షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందాడు. భర్త వెంకటయ్య మధ్యాహ్నమైన ఇంటికి రాకపోయేసరికి భార్య నర్సమ్మ ఫోన్ చేస్తే స్విచాఫ్ వచ్చింది. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

వెతుకుతున్న క్రమంలో మరో నలుగురికి షాక్

కుటుంబ సభ్యులు ఆదివారం ఉదయం దోతిగూడెం శివారులో వెతుకుతుండగా శ్రీశైలం పొలం సమీపంలో వెంకటయ్య బైక్ కన్పించింది. దాంతో ఇక్కడే ఉండవచ్చునని కొండపల్లి శ్రీను, కప్పెర శ్రీనుతో పాటు మరో ఇద్దరు వెతుకుతున్న క్రమంలో వీరికి సైతం కరెంట్ తీగ తగలడంతో షాక్‌కు గురయ్యారు. గ్రామస్తులు రైతుకు సమాచారం ఇవ్వడంతో వచ్చి కరెంట్ కనెక్షన్ తొలగించి అక్కడ నుంచి పారిపోయాడు. అనంతరం అటుగా వెళ్లి చూడగా వెంకటయ్య విగతజీవుడిగా కనిపించాడు.

మృతుడి కుటుంబానికి రూ.20లక్షల పరిహారం

విషయం తెలుసుకున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. రైతు నిర్లక్ష్యం కారణంగానే నిండు ప్రాణం బలైందని రోదిస్తూ ఆందోళన చేపట్టారు. దాంతో ఇరువర్గాలకు చెందిన పెద్ద మనుషులు కూర్చొని మృతుడి కుటుంబానికి రూ.20లక్షల పరిహారం చెల్లించే విధంగా అంగీకారం తెలిపారు. విషయం తెలుసుకున్న చౌటుప్పల్ రూరల్ సీఐ మహేశ్, ఎస్ఐ విక్రమ్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన లారీ.. నలుగురికి గాయాలు

చౌటుప్పల్: పట్టణ కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలంలోని గుండ్లబావి గ్రామానికి చెందిన చిదుగుళ్ల శోభ, తన చిన్న కుమార్తె సింధుతో కలిసి పీపల్‌పహాడ్ గ్రామంలోని తన పెద్ద కుమార్తె మాదగోని శ్రీజ ఇంటికి ఆదివారం వెళ్లారు. సోమవారం అందరూ కలిసి పీపల్‌పహాడ్‌లో ఆటో ఎక్కి గుండ్లబావికి బయల్దేరారు. మార్గమధ్యలో చౌటుప్పల్ పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఆటోను ఆపారు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన లారీ ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలోని శోభ, ఆమె కుమార్తెలు శ్రీజ, సింధుతో పాటు ఆటో డ్రైవర్ ఎర్రగాలయ్య గాయపడ్డారు. గాయపడ్డ వీరిని స్థానికులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎస్. దేవేందర్ తెలిపారు.

కాలువలో జారిపడి వ్యక్తి మృతి

సూర్యాపేట క్రైం: ప్లాస్టిక్ బాటిళ్లు ఏరుకునేందుకు కాలువలోకి దిగుతున్న వ్యక్తి ప్రమాదవశాత్తు అందులో జారిపడి మృతిచెందాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బొడ్రాయి బజారులో ఆదివారం జరిగింది. పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణానికి చెందిన నీలం నారాయణ(50), కోటేశ్వరమ్మ దంపతులు ప్లాస్టిక్ బాటిళ్లు ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మిర్యాలగూడ నుంచి కాలినడకన ప్లాస్టిక్ బాటిళ్లు ఏరుకుంటూ ఆదివారం సూర్యాపేటకు చేరుకున్నారు. సూర్యాపేట పట్టణంలోని బొడ్రాయి బజారులో గల పెద్ద కాలువలోకి ప్లాస్టిక్ బాటిళ్లు ఏరేందుకు నారాయణ దిగుతుండగా ప్రమాదవశాత్తు అందులో జారిపడ్డాడు. ఎంతసేపటికీ అతడు బయటకు రాకపోవడంతో కోటేశ్వరమ్మ స్థానికుల సహాయంతో నారాయణను కాలువ నుంచి బయటకు తీయించి స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య కోటేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు



శోభారాణి

పెద్దవూర: మండలంలోని కుంకుడుచెట్టుతండా గ్రామ పంచాయతీ పరిధిలోని బోనూతల గ్రామానికి చెందిన జొన్నలగడ్డ శోభారాణి కుటుంబ కలహాలతో మూడు రోజుల క్రితం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు ఎస్ఐ అజ్మీరా రమేష్ సోమవారం తెలిపారు. ఆమె వయస్సు 40 సంవత్సరాలు ఉంటుందని పేర్కొన్నారు. ఆమె ఆచూకీ తెలిస్తే 8712670198 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. శోభారాణి భర్త వేణుగోపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రామన్నపేటలో వివాహిత మిస్సింగ్

రామన్నపేట: మండలంలోని ఎన్నారం గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైంది. రామన్నపేట ఎస్ఐ ఎం. లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నారం గ్రామ పంచాయతీకి చెందిన కక్కిరేణి అంజయ్య కుమార్తె సంతోష(22)ను రెండేళ్ల క్రితం నార్కట్‌పల్లి మండలంలోని నక్కలపల్లి గ్రామ పంచాయతీకి చెందిన భాషపాక సైదులుకు ఇచ్చి వివాహం జరిపించారు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరగడంతో పలుసార్లు పెద్దమనుషులు సర్ది చెప్పారు. ఈ క్రమంలో ఈ నెల 11న నక్కలపల్లిలోని తన ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన సంతోష తిరిగి రాలేదు. అదేరోజు సైదులు ఎన్నారం గ్రామానికి వచ్చి విషయాన్ని సంతోష తల్లిదండ్రులకు తెలియజేశాడు. బంధువులు స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఈనెల 12న రామన్నపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తెలుగు వెలుగు జాతీయ పురస్కారానికి ఎంపిక



షేక్ జానీపాషా



లోకేష్

మునగాల: మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన మథర్ థెరిస్సా యువజన సంఘం వ్యవస్థాపకుడు షేక్ జానీ, సభ్యులు వి. లోకేష్, కీత వీరబాబు, ఎం. ఫణీందర్ తెలుగు వెలుగు జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఇటీవల విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో తెలుగు వెలుగు జాతీయ పురస్కారాల ప్రదానోత్సవంలో ఈ పురస్కారాన్ని అందుకున్నట్లు వారు సోమవారం తెలిపారు. తమ సేవా కార్యక్రమాలు గుర్తించి ఈ పురస్కారం అందజేసినట్లు తెలిపారు. ఈ ప్రదానోత్సవంలో తెలుగు వెలుగు వేదిక జాతీయ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్, జాతీయ కన్వీనర్లు రాగిశెట్టి బ్రహ్మ, వలబోజు మోహన్‌రావు పాల్గొన్నట్లు తెలిపారు. వారు పురస్కారానికి ఎంపిక కావడం పట్ల జగన్నాథపురం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



రమణ మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

చిట్యాల: మండలంలోని వనిపాకల గ్రామానికి చెందిన మహిళ ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. చిట్యాల ఎస్ఐ ఐరుగు రవి తెలిపిన వివరాల ప్రకారం.. వనిపాకల గ్రామానికి చెందిన వెలిజాల రమణ(50) భర్త భాస్కర్ పదిహేనేళ్ల క్రితమే మృతి చెందడంతో ఆమె ఒంటరిగానే ఉంటుంది. ఆమెకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె వివాహం అయ్యింది. కుమారుడు హైదరాబాద్, ఇతర ప్రాంతాల్లో ఉంటూ అప్పుడప్పుడు తల్లిని చూసేందుకు వస్తూ ఉంటాడు. కాగా సోమవారం మధ్యాహ్నం అయినా రమణ ఇంట్లో నుంచి బయటకు రాకపోవటంతో స్థానికులు వెళ్లి తలుపులు తీసి చూడగా మంచంపై ఆమె విగతజీవిగా పడి ఉంది. దీంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. నార్కట్‌పల్లి సీఐ మహేష్ గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు భార్గవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మునుగోడు బీజేపీ అభ్యర్థిపై భూకబ్జా ఆరోపణలు

• విలేకరులకు వెల్లడించిన బాధితులు

మునుగోడు: మునుగోడు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి తమ వారసత్వపు భూమి కబ్జా చేశాడని హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం తారామతిపేట గ్రామానికి చెందిన భూలక్ష్మితో పాటు ఆమె సోదరి, సోదరుడు సోమవారం మునుగోడులో విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి వివరాలు వెల్లడించారు. తారామతిపేటలో తమకు వారసత్వంగా సంక్రమిస్తున్న ఇనామ్ భూమి 200 ఎకరాలను 20 ఏళ్ల క్రితం చలమల్ల కృష్ణారెడ్డి కబ్జా చేశాడని ఆరోపించారు. ఆ భూమిని తిరిగి పొందేందుకు తాము కోర్టుకు వెళ్తే ఇటీవల కోర్టు అతడిపై సీబీఐ విచారణ జరపాలని ఆదేశించినదని, దాని నుంచి తప్పించుకునేందుకే ఆయన బీజేపీలో చేరాడని అన్నారు. చలమల్ల కృష్ణారెడ్డి నుంచి తమకు ప్రాణహాని ఉందని, అతడి నుండి తమకు రక్షణ కల్పించాలని కోరారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

చౌటుప్పల్: మనోవేదనతో చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామంలో సోమవారం ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ ఎస్. దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మునుగోడు మండలం పులిపలుపుల గ్రామానికి చెందిన గోపనబోయిన కిరణ్(33), మమత భార్యాభర్తలు. వీరికి ఎనిమిదేళ్ల క్రితం వివాహం కాగా ఇద్దరు కుమారులు ఉన్నారు. కిరణ్‌కు భార్యతో తరచూ గొడవలు జరుగుతుండేవి. గ్రామంలో కిరణ్ చేసిన అప్పులు తిరిగి చెల్లించలేకపోవడంతో 6నెలల క్రితం తన భార్య మమత పుట్టింటికి వెళ్లిపోయింది. దాంతో మనోవేదనకు గురైన కిరణ్ మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం దీపావళి పండుగ కావడంతో చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామంలో ఉంటున్న తన మేనత్త దంటిక మంగమ్మ ఇంటికి కిరణ్ వచ్చాడు. సోమవారం ఉదయం వారి వ్యవసాయబావి వద్దకు వెళ్లిన కిరణ్ అక్కడ వేప చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి కృష్ణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.